క్లుప్తంగా

వానొస్తే... ప్రయాణం నరకమే...


వేపాడ: బక్కునాయుడుపేట వెళ్లే రహదారి దుస్థితి

వేపాడ: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బక్కునాయుడుపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వానొస్తే ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. బక్కునాయుడుపేటలో ఉన్న గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో 1300 మంది పిల్లలు చదువుతున్నారు. వీరి వద్దకు తల్లిదండ్రులు వారం వారం వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి బాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు


గజపతినగరంలో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

గజపతినగరం : మండల కేంద్రంలో శ్రీకృష్ణ ప్రతిమను బుధవారం ఊరేగించారు. వెంకటాపురం గ్రామం నుంచి గజపతినగరం హైవే మీదుగా గణేష్ కోవెల, దిగువ వీధుల మీదుగా అంగరంగ వైభవంగా భక్తులు ప్రతిమను ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి నుంచి నేటి వరకు రోజూ పూజలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు దివకాల గోవిందు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు


అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

వేపాడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 2లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం మొక్కలు నాటారు. వన మహోత్సవంలో భాగంగా వీటిని సూపర్‌వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి తదితరులు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సూపర్‌వైజర్లు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మంగలక్ష్మి, రాజేశ్వరి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఖాతా ఆన్‌లైన్ చేయాలి


కంప్యూటరీకరణపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ సేతుమాధవన్

గుర్ల: సహకార సంఘంలో నమోదైన ప్రతి రైతు వివరాలు, ఖాతాలను వేగవంతంగా ఆన్‌లైన్ చేయాలని జేసీ సేతు మాధవన్ పీఏసీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కెల్ల ప్రాథమిక సహకార సంఘాన్ని ఆయన గురువారం సందర్శించారు. రైతుల వివరాల కంప్యూటరీకరణ జరుగుతున్న తీరు పరిశీలించారు. సెప్టెంబర్ మొదటి వారం నాటికి పీఏసీఎస్‌లో ఉన్న రైతుల ఖాతాల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. అక్టోబర్ నెల నుంచి పీఏసీఎస్ లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయని తెలిపారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి, గుర్ల డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ప్రీతి మానస, కెల్ల సొసైటీ సీఈఓ మండల శ్రీను ఉన్నారు.

'భోజనం' పరిశీలన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

జామి: మండలంలోని కలగాడ మండల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ 2 బి.గంగరాజు గురువారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

దేశ భాషలందు తెలుగు లెస్స అని పలువురు కొనియాడారు. తేనె కంటే తియ్యనైనది తెలుగు భాష అని పేర్కొన్నారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో వేడుకగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు కార్యక్రమాలు చేపట్టారు. పద్యాలు, కవితలు, పొడుపు కథల పోటీలు నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ జయంతిని కూడా జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


వేపాడ: వేపాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన 100మంది తెలుగు కవుల చిత్రపటాలు


వేపాడ: ఆదర్శ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల కోలాటం


గుర్ల: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్‌ఐ నారాయణ రావు


గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు


చీపురుపల్లి: తెలుగుతల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ తదితరులు


లక్కవరపుకోట : జ్యోతిరావ్‌పూలే పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కొత్తవలస : కంటకాపల్లి హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కొత్తవలస : తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గిడుగు రామ్మూర్తి పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు తదితరులు


చీపురుపల్లి రూరల్(గరివిడి) : తాటిగూడ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చీపురుపల్లి: మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్రీడాకారులు


గుర్ల: ధ్యానచంద్, గిడుగు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న చింతలపేట హైస్కూల్ సిబ్బంది


ఎస్.కోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం


ఎస్.కోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతి

ఏకగ్రీవంగా ఎస్ఎంసీ ఎన్నిక

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన నేపథ్యంలో గురువారం మూడోసారి ఎన్నిక నిర్వహించారు. దీంతో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా రేగాన భవానీ, వైస్ చైర్మన్‌గా మండల రాజారావును తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల హెచ్ఎం రెహానా బేగం నేతృత్వంలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెంగువలో..

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ పాఠశాల ఏఎంసీ చైర్మన్ ఎన్నిక గురువారం పూర్తయ్యిందని ఎంఈఓ విమల తెలిపారు. పాఠశాల చైర్మన్‌గా రేపాక తవిటినాయుడు, వైస్ చైర్మన్‌గా కొండల దేవి ఎన్నికైనట్లు తెలిపారు.

ఎస్‌జీ పేటలో గ్రామసభ


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేటలో గురువారం సర్పంచ్ గోగాడ కళావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి ఈ సభను వినియోగించుకోవాలని అధికారులు కోరారు. అంతకు ముందు అధికారులు గ్రామంలోని సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఇతర కార్యాలయాలు పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ అరుణకుమారి, ఈఓపీఆర్డీ లక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు బి.సత్యనారాయణ, సత్యకిశోర్, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్...

గుర్ల: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నయ్ అన్నారు. మండలంలోని పాలవలస సచివాలయంలో జ్వరాలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. జ్వరాలు అధికంగా ఉండడం వల్ల కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. అలసత్వం ప్రదర్శిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం


అప్పారావుకు నగదు సాయం అందజేస్తున్న సభ్యులు

వేపాడ: మండల కేంద్రంలోని మన వేపాడ – మన నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన రంభ అప్పారావు క్యాన్సర్‌తో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8,500 అందజేశారు. అలాగే ఆదపురెడ్డి నారప్పకు కాలు విరిగిపోవడంతో వైద్య సేవల నిమిత్తం రూ.5వేలు సాయం చేసి ఆదుకున్నారు. సంస్థ సభ్యులకు ఆయా బాధితుల కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టార్టప్‌లతో దేశాభివృద్ధి



పోస్టర్ ప్రజెంటేషన్‌ను వివరిస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధిలో యువ పారిశ్రామికులు రూపొందించిన 'స్టార్టప్'లు కీలక భూమిక పోషిస్తాయని సీతం కళాశాల డీన్ డాక్టర్ వై. నరేంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'సమాజంలో స్టార్టప్‌ల పాత్ర – ఇన్నోవేషన్ అంబాసిడర్ల సహకారం కోసం మెంటర్‌షిప్ మద్దతు' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిభావంతులైన విద్యార్థుల కొత్త ఆలోచనలకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


సంతపేట గ్రామం సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

లక్కవరపుకోట : మండలంలోని బుధవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో ఆ శాఖ ఏఈ కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఉదయం యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టారు. సంతపేట, లక్కవపుకోట గ్రామంలో గాలివానకు విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. ప్రమాదకరంగా వున్న చెట్టు కొమ్మలను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలైనా చిన్ననాగళ్లవలస, సదానందపురం, గొలగాం, తాటిపూడి, దమరసింగి, వల్లాపురం, శేషుపేట, గుర్ల గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి పి.హరి గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

శృంగవరపుకోట: జీవిత బీమా రంగాన్ని నిర్వీర్యం చేసేలా చేస్తున్న కుట్రలను ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్లు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నినాదాల చేశారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన పిలుపు మేరకు సిఐటీయూ నేతృత్వంలో ఆందోళన చేసిన ఏజెంట్లను ప్రభావితం చేసే బీమా సుగం, బీమా విస్తార్, బీమా వాహక్, బీమా ట్రినిటీ, బీమా విట్రాగ్, జీవన్ సమర్థ్‌లను అమలు చేయొద్దని, ఎల్ఐసీని జీఎస్టీ నుంచి మినహాయించాలని, రూ.5లక్షలు దాటిన పాలసీలపై ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని నినాదాలు చేశారు. పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు

● ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

గంట్యాడ: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి హెచ్చరించారు. మండలంలోని లక్కిడాం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో పిల్లల హాజరు పట్టిక, పిల్లలకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని పూర్తి స్థాయిలో అందించాలన్నారు. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పిల్లలకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలన్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఆమె వెంట సీడీపీఓ ఉమాభారతి తదితరులు ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

మెరకముడిదాం: మండల కేంద్రమైన మెరకముడిదాం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కోట్ల ఎల్లంనాయుడు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం, హాకీ క్రీడా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థులు వివిధ రకాల వేషాధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో లవకుశ వేషాధారణతో చేసిన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు బహుమతులను అందజేసారు.

లబ్ధిదారులకు ఉచిత వైద్యసేవలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) లబ్ధిదారులకు ఒక్క పైసా కూడా ఖర్చుకాకుండా ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నాణ్యమైన భోజనం, మెరుగైన చికిత్స రోగులకు అందించాలన్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దన రావు, ఆర్. ముత్యాలనాయుడు, భాను, వి. ఉమ, తదితరులు పాల్గొన్నారు.

5 కె రెడ్ రన్ ద్వారా హెచ్‌ఐవీపై అవగాహన


5కె రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం: ప్రతిఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకుని, భాగస్వాములు కావాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు కోరారు. ఈ మేరకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కోసం స్థానిక విజ్జీ స్టేడియం వద్ద విద్యార్థులతో నిర్వహించిన 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్‌ను ఆమె గురువారం ఉదయం ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. యూత్‌ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ మారథాన్ పోటీలను బాలురు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ మూడు విభాగాలుగా విభజించి, ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి రూ.7,000, రెండో బహుమతి రూ.4,000 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ క్రీడల్లో దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. క్రీడారంగంలో ధ్యాన్‌చంద్ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ రాణి, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.